# సాక్షి వికారాబాద్

శనివారం ၊ 3 ၊ జూన్ ၊ 2023






## ఎల్లమ్మతల్లికి బోనాలు

కుల్కచర్ల మండలం కామునిపల్లిలో శుక్రవారం ఎల్లమ్మ తల్లి బోనాలు కనులపండువగా నిర్వహించారు. 8లో▸



జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, వినోద్‌కుమార్, ఎస్పీ కోటిరెడ్డి



సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న వినోద్‌కుమార్, సునీతారెడ్డి, కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలు

### న్యూస్‌రీల్

## దశాబ్ది ఉత్సవాలను నిర్లక్ష్యం చేయొద్దు

- నేడు రైతు వేదికల్లో సంబరాలు
- కలెక్టర్ నారాయణరెడ్డి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్

**వికారాబాద్ అర్బన్:** ఇరవై రోజుల పాటు నిర్వహించే తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను సమన్వయంతో నడిపించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రత్యేక రాష్ట్ర అవతరణ సంబరాలపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మొదటి రోజు వేడుకలను విజయవంతం కావడంపై అధికారులను అభినందించారు. రెండో రోజు రైతు దినోత్సవాన్ని జయప్రదం చేసేందుకు రైతు వేదికల వద్దకు రైతులను పెద్దఎత్తున తరలించాలని సూచించారు. జిల్లాలోని 99 రైతు వేదికలను అందంగా తీర్చిదిద్దే బాధ్యతలను అధికారులు, గ్రామ కార్యదర్శులు పూర్తి బాధ్యత తీసుకోవాలన్నారు. వచ్చిన వారందరికీ భోజనాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్యక్రమాల్లో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 9వ తేదీన నిర్వహించే సంక్షేమ దినోత్సవం రోజు లబ్ధిదారులకు పట్టాల పంపిణీ కోసం మండలాల్లో ఉన్న ప్రభుత్వ స్థలాలకు లే ఔట్‌లు చేసి పంపిణీకి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను సర్వేయర్లతో సర్వే చేయించి పంపిణీకి రెడీగా ఉంచాలన్నారు. ఇదే రోజు గ్రామాల్లో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, డీఆర్‌ఓ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**తాండూరు టౌన్:** తెలంగాణ రాష్ట్ర గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీదేవి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో బోధించేందుకు జువాలజీ, రసాయనశాస్త్రం, పాఠశాలలో ఆంగ్లం బోధించేందుకు ఆసక్తి ఉన్న వారు ఈనెల 8వ తేదీ లోపు అన్ని సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ఫారాన్ని నేరుగా గురుకులానికి వచ్చి అందజేయాలన్నారు.

## నిధులు ఇవ్వకుండా వేడుకలు ఎలా?



తొండుపల్లిలో సోనియాగాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సర్పంచ్ గీత

**పరిగి:** గ్రామంలో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించకుండా.. ప్రతిరోజూ ఉత్సవాలు చేయమంటే ఎలా సాధ్యమని తొండుపల్లి సర్పంచ్ గీత ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్ర అవతరణ వేడుకల సందర్భంగా జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం సోనియాగాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు సంబరాలు నిర్వహించడం ఆనందంగా ఉన్నప్పటికీ నిధులు ఇవ్వకుండా 21 రోజుల పాటు కార్యక్రమాలు ఎలా నిర్వహిస్తామని ఆవేదన వ్యక్తంచేశారు. తమ గ్రామంలో ఎలాంటి సంబరాలు నిర్వహించబోమని వెల్లడించారు. ప్రభుత్వం సూచిస్తున్న ప్రతీ కార్యక్రమాన్ని అమలు చేస్తున్న సర్పంచ్‌ల ఆర్థిక పరిస్థితులను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు హన్మంత్‌రెడ్డి పాల్గొన్నారు.

## భగ్గుమన్న భానుడు

42.7 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదు

**సాక్షి, సిటీబ్యూరో:** సూర్య భగవానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. రోజురోజుకూ గరిష్ట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఉదయం 8 నుంచే భగభగలతో జనం అల్లాడుతున్నారు. నాలుగు రోజులుగా సాధారణం కంటే రెండు డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రత నమోదవుతోంది. శుక్రవారం 42.7 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. నైరుతి రుతుపవనాలు మరో వారం, పది రోజుల్లో తెలంగాణలోకి ప్రవేశిస్తాయని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నప్పటికీ ఎండల ప్రభావం ఏ మాత్రం తగ్గడం లేదు. గురువారం అత్యధికంగా 41.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదుకాగా, శుక్రవారం 42.7 డిగ్రీలకు చేరింది.

# అద్భుతాల తెలంగాణ

### తొమ్మిదేళ్లలో ఊహకందని అభివృద్ధి

- సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే ప్రథమం
- ప్రభుత్వం నుంచి అన్నివర్గాలకు సమప్రాధాన్యం
- ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్
- ఘనంగా ప్రారంభమైన రాష్ట్ర అవతరణ వేడుకలు



విద్యార్థుల కళాప్రదర్శన

**వికారాబాద్:** అనేక మంది అమరవీరుల ప్రాణ త్యాగాలతో సాధించుకున్న తెలంగాణ అనతికాలంలోనే అనేక విజయాలను అందుకుని అద్భుతాలు సాధించిందని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ అన్నారు. రాష్ట్ర ఆవిర్భవ వేడుకలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఉద్యమంలో అసువులుబాసిన జిల్లా వాసులు యాదయ్య, దీపక్, మేషక్ కుటుంబ సభ్యులను సన్మానించారు. బాధిత కుటుంబ సభ్యులకు ఉద్యోగం కల్పించారు. గడిచిన తొమ్మిదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కొత్త మండలాలు, జీపీలు, డివిజన్లు, కొత్త పోలీస్ స్టేషన్లు, కొత్త జిల్లాల ఏర్పాటుతో పరిపాలన ప్రజల ముంగిట్లోకి వచ్చిందన్నారు. జిల్లాలో 20 మండలాలు, 508 రెవెన్యూ గ్రామాలు, 580 గ్రామ పంచాయతీల ఏర్పాటుతో కొత్త జిల్లాను ఏర్పాటు చేసిన ప్రభుత్వం వీటి అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు.

**విప్లవాత్మకత మార్పులు**

ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో పేదలకు విద్య, వైద్యం మరింత చేరువైందని వినోదోకుమార్ అన్నారు. మాతా శిశు సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా ఇప్పటి వరకు జిల్లాలో 41,248 మందికి కేసీఆర్ కిట్లు అందజేశామని తెలిపారు. కంటి వెలుగు పథకం ద్వారా 3,88,227 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 88,552 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశామన్నారు. తాండూరు, వికారాబాద్‌లో డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేసి చికిత్సలు అందజేస్తున్నామని వివరించారు. రూ.235 కోట్లతో నూతన మెడికల్ కళాశాల, డయాగ్నోస్టిక్ సెంటర్, ఆయుష్ ఆస్పత్రులు, తాండూరులో నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేశామని తెలిపారు.

**పల్లెలు, పట్టణాల ప్రగతి**

పల్లె, పట్టణ ప్రగతిలో భాగంగా అనేక మౌళిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. గ్రామాలు, పట్టణాల్లో వైకుంఠధామాలు, స్మృతి వనాలు, ఆహ్లాదాన్ని పంచే పార్కుల నిర్మాణం, డంపింగ్ యార్డులు, నర్సరీల నిర్మాణం, నీటి సంరక్షణ, ఇంకుడుగుంతలు నిర్మించామన్నారు. పారిశుద్ధ్య అవసరాలకోసం ప్రభుత్వం ట్రాక్టర్లను సమకూర్చిందని తెలిపారు. మిషన్ భగీరథలో భాగంగా జిల్లాలో 2,598 కిలోమీటర్ల పైప్‌లైన్, రూ.490 కోట్లతో 880 వాటర్ ట్యాంకులు నిర్మించి, 2,03,688 నల్లా కనెక్షన్లు ఇచ్చామని స్పష్టంచేశారు. సామాజిక భద్రతలో భాగంగా మహిళలకు స్త్రీనిధి ద్వారా రుణాలు, ఆసరా, వృద్ధాప్య పెన్షన్లు అందజేస్తున్నామని తెలిపారు. జిల్లాలో దళితబంధు పథకం ద్వారా రూ.35.80 కోట్లతో 358 మంది లబ్ధిదారులకు రూ.10 లక్షల చొప్పున వెచ్చించి.. వివిధ స్కీంలు అమలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ నారాయణరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి, ఎమ్మెల్యేలు ఆనంద్, మహేశ్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్, జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల ఆయా శాఖల జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అమరవీరుల కుటుంబాలకు సన్మానం

# 35 మందిపై అట్రాసిటీ కేసు

**ఎస్‌ఐ విశ్వజన్ వెల్లడి**

**దోమ:** ఆలయ ప్రవేశం విషయమై జరిగిన ఘర్షణలో 35 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విశ్వజన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిధిలోని బ్రాహ్మణపల్లిలో దళితులు, కొందరు గ్రామస్తులకు జరిగిన ఘర్షణ ఉద్రిక్తతకు దారి తీసిన విషయం విదితమే. ఈ విషయంలో పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాల వారిని చెదరగొట్టే ప్రయత్నం చేసినా గొడవ సద్దుమణగలేదు. పోలీసు వాహనాన్ని ధ్వంసం చేయడంతో పాటు ఆలయ ప్రవేశం విషయంలో గొడవకు పాల్పడిన 35 మందిపై అట్రాసిటీ కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. ఇందులో అధికార పార్టీ గ్రామ సర్పంచ్‌తో పాటు ఐదుగురు మహిళలు, 29 మంది గ్రామస్తులు ఉన్నారని చెప్పారు. ఈ మేరకు వారిని వైద్య పరీక్షల నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించిన అనంతరం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తామన్నారు.

**కక్ష సాధింపే..**

ఎస్‌ఐ విశ్వజన్ ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తూ కేవలం ఒకే వర్గానికి చెందిన 35 మందిపై కేసులు నమోదు చేయడం దారుణమని బ్రహ్మణపల్లి గ్రామస్తులు మండిపడుతున్నారు. ఇరు వర్గాలు దాడులు చేసుకున్నప్పటికీ కేవలం ఒకే వర్గానికి చెందిన వ్యక్తులపై కేసులు నమోదు చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. ఇది ముమ్మాటికీ కక్ష సాధింపేనని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గొడవకు కారణమైన మూలాలను విస్మరించి కేసులు నమోదు చేయడంపై సర్వత్రా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మొదటగా ఆలయ ప్రవేశం చేసిన వారిలోని ఓ వ్యక్తి గ్రామంలోని మరో వర్గానికి చెందిన వ్యక్తితో రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడంతో యువకుల మధ్య చోటు చేసుకున్న ఘర్షణ ఉద్రిక్తతకు దారి తీసింది. గొడవ జరిగిన విషయాన్ని మొదటగా సర్పంచ్ ఎస్‌ఐకి తెలిపినప్పటికీ స్పందించకుండా మరో వర్గం వ్యక్తుల ఫిర్యాదుతో వెంటనే స్పందించడంతో గొడవకు మరింత ఆజ్యం పోసినట్లయ్యిందని గ్రామస్తులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి గొడవకు ఆజ్యం పోసిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**దళితులు కూడా హిందువులే..**

**కుల్కచర్ల:** ప్రస్తుత ఆధునిక యుగంలోనూ ఆలయ ప్రవేశాల విషయంలో హిందువుల మధ్య గొడవలు జరగడం దారుణమని దళిత యువశక్తి యువజన సంఘం కుల్కచర్ల మండల అధ్యక్షుడు కర్రె భరత్‌కుమార్ ఆవేదన వ్యక్తంచేశారు. బ్రాహ్మణపల్లి ఘటనపై విచారాన్ని ప్రకటించారు. దళితులు కూడా హిందువులేనని, అన్యమత ప్రచారం చేసేవారిని అడ్డుకోవచ్చు కానీ దళిత ప్రజలను ఆలయం లోపలికి రానివ్వకపోవడం దారుణమని తెలిపారు. ఈ విషయంపై జిల్లా అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.

## పరిహారం అడిగితే దౌర్జన్యమా?



జీవన్గీలో భూ నిర్వాసితులకు మద్దతుగా ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**బషీరాబాద్:** రోడ్డులో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం ఇవ్వకుండా వారిపైనే దౌర్జన్యానికి దిగుతున్న అధికార పార్టీ నాయకుల తీరు దారుణమని కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్ మహరాజ్ అన్నారు. అప్రోచ్ రోడ్డులో భూములు కోల్పోయిన 19 మందికి ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పించాల్సి ఉన్నా అడ్డొస్తే జేసీబీలతో తొక్కిస్తాం అంటూ బెదిరించడం సరికాదన్నారు. జీవన్గీలో వంతెనకు ఇరువైపులా వేస్తున్న అప్రోచ్ రోడ్డులో భూములు కోల్పోయిన రైతులకు కాంగ్రెస్, బీజేపీ నాయకులు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా పనులు జరుగుతున్న ప్రాంతానికి శుక్రవారం ఇరు పార్టీల నేతలు బాసటగా నిలిచారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. 19 మంది రైతులు పదెకరాల భూమిని కోల్పోగా.. కనీసం రూ.కోటి పరిహారం ఇప్పించలేని నాయకులు రైతులను బెదిరించడం ఏమిటని ప్రశ్నించారు. ఏడాది క్రితం ప్రొసీడింగ్‌లు ఇచ్చి ఇప్పటి వరకు పరిహారం ఎందుకు ఇప్పించలేదని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వానికి రైతులు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. బీజేపీ సీనియర్ నాయకులు నరేష్ మహరాజ్ మాట్లాడుతూ.. రైతులకు పరిహారం వచ్చే వరకు బాధితులకు అండగా నిలుస్తామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో గుండాల రాజ్యం నడుస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ పనులను అడ్డుకోవద్దని, ఏదైనా ఉంటే అధికారులతో మాట్లాడాలని బషీరాబాద్ ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ ఆందోళనకారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, సీనియర్ నాయకులు జనార్దన్‌రెడ్డి, గిరిజపురం మాధవరెడ్డి, నర్సిరెడ్డి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రజినీ, తాండూరు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అలీమ్, అబీబ్, చంద్రశేఖర్‌గౌడ్, శీను, ముస్తఫా, లతీఫ్‌ఖాన్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# నేటి నుంచి ‘బడిబాట’

- పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు
- ఏర్పాట్లు చేసిన విద్యాశాఖ
- విద్యార్థుల నమోదుపై ప్రత్యేక దృష్టి

**కొడంగల్ రూరల్:** ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యార్థుల నమోదే లక్ష్యంగా శనివారం నుంచి ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఉన్నతాధికారులు దిశానిర్దేశం చేశారు. ఉపాధ్యాయులు ఈ నెల 3నుంచి 17వ తేదీ వరకు రోజుకో కార్యక్రమం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా విద్యార్థులు, తల్లిదండ్రులను కలుస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు, నిష్ణాతులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన, ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉచిత దుస్తుల పంపిణీ తదితర సౌకర్యాలు వివరిస్తూ పిల్లలను చేర్పించాలని కోరనున్నారు. మధ్యలో చదువు మానేసిన వారు, బాల కార్మికులను గుర్తిస్తూ పాఠశాలల్లో చేర్పించేందుకు కృషిచేస్తారు. ఐదేళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించడానికి ప్రత్యేక కృషి చేపడుతూనే ఐదేళ్లు నిండిన వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకోనున్నారు. మన ఊరు మనబడి, మనబస్తీ మనబడి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం, పాఠశాలల్లో కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు వివరిస్తూ ముమ్మర ప్రచారం నిర్వహించేందుకు విద్యా శాఖాధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొంటున్నారు.

**కార్యక్రమాలు ఇవే..**

- 3నుంచి 9వ తేదీ వరకు గ్రామాలు, ఆవాస ప్రాంతాల్లో పిల్లలను గుర్తిస్తూ ప్రత్యేక నమోదు కార్యక్రమం.
- 12న మనఊరు మనబడి.. మనబస్తీ మన బడి కార్యక్రమంలో పాఠశాలలను మామిడి తోరణాలు, ముగ్గులతో అలంకరించి పండగ వాతావరణాన్ని ఏర్పాటుచేయడం, తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులను ఆహ్వానించి సమావేశం నిర్వహించడం.
- 13న తొలిమెట్టు కార్యక్రమంపై తల్లిదండ్రులకు అవగాహన. తరగతులు, సబ్జెక్టుల వారీగా అభ్యసన ఫలితాలపై పోస్టర్ల ప్రదర్శన, విద్యార్థుల సామర్థ్యం, స్థాయిని తల్లిదండ్రులకు వివరించడం.
- 14న విద్యార్థులతో సామూహిక అక్షరాభ్యాసం, ప్రజా ప్రతినిధులను ఆహ్వానించి బాలసభలు నిర్వహించి సాంస్కృతిక ప్రదర్శనలు చేపట్టనున్నారు. పాఠశాల స్థాయి, పిల్లల కమిటీ, క్లబ్‌లు ఏర్పాటుచేయాలి. బోధనాభ్యసన సామగ్రితో ప్రదర్శన.
- 15న ప్రత్యేక అవసరాల పిల్లల నమోదుపై దృష్టి పెట్టాలి. గ్రామాల్లో వివిధ వైకల్యాలతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి పాఠశాలలు, భవిత కేంద్రాల్లో చేర్పించాలి.
- 16న ఆంగ్ల మాధ్యమ తరగతుల నిర్వహణపై తల్లిదండ్రులు, విద్యార్థులకు అవగాహన కల్పించాలి.
- 17న బాలికావిద్య ప్రాముఖ్యత, ఉన్నత చదువుల ప్రాధాన్యతపై అవగాహన కల్పించాలి. పదో తరగతి, ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు, తల్లిదండ్రులను ఆహ్వానించి ఉన్నత విద్యాభ్యాసం చేసేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలపై అవగాహన.

**పకడ్బందీగా..**



ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని పాఠశాలలు తెలంగాణ ఆవిర్భావ, దశాబ్ది ఉత్సవాలతోపాటు బడిబాట కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించనున్నాం. పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశాం. పిల్లల విద్యాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించేందుకు కార్యచరణ చేశాం.

– రాంరెడ్డి, ఎంఈఓ, కొడంగల్



అప్పాయిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులతో సిబ్బంది

# ఉద్యమకారులకు సన్మానం



తెలంగాణ ఉద్యమకారులతో శుభప్రద్‌పటేల్

**వికారాబాద్ అర్బన్:** తెలంగాణ ఉద్యమకారులందరినీ ఒకే వేదికపై కలవడం ఎంతో సంతోషంగా ఉందని బీసీ కమిషన్ సభ్యుడు ఎస్.శుభప్రద్ పటేల్ అన్నారు. శుక్రవారం స్థానిక బసంత్ ఫంక్షన్ హాలులో ఉద్యమ కారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమ సమయంలో చోటు చేసుకున్న సంఘటనలు పోరాటాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఉద్యమ కారులను శుభప్రద్ శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అభివృద్ధి ఫోరం అధ్యక్షుడు కె.శ్రీనివాస్, జెడ్పీ వైస్‌చైర్మన్ విజయ్ కుమార్, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నార్మల్ మదర్ డెయిరీ సిబ్బందికి వేతనాల పెంపు

**హయత్‌నగర్:** తెలంగాణ ఆవిర్భావ దినోత్సం సందర్భంగా తమ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు వేతనాలు పెంచుతున్నట్లు నార్మల్ మదర్ డెయిరీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి ప్రకటించారు. డెయిరీ కార్యాలయం వద్ద శుక్రవారం జెండా ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. సంస్థలో పని చేస్తున్న ఉద్యోగుల సంక్షేమానికి తగిన చర్యలు తీసుకుంటున్నామని, సంస్థ ఆర్థిక వనరులను దృష్టిలో ఉంచుకుని ఉద్యోగులందరికీ న్యాయం చేస్తామని అన్నారు. ఆఫీస్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్ల రూ.1,507, అసిస్టెంట్‌లకు రూ.2,777, హెల్పర్లకు రూ.3.012 చొప్పున పెంచామన్నారు.

## గ్రంథాలయ సంస్థ సేవలను విస్తరిస్తాం

**మంత్రి సబితారెడ్డి**

**ఇబ్రహీంపట్నం రూరల్:** పాఠకులకు మరింత చేరువయ్యేలా గ్రంథాలయ సంస్థ సేవలను విస్తరిస్తున్నట్లు విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. కొంగరకలాన్‌లోని కలెక్టరేట్ కార్యాలయ భవన సముదాయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఏర్పాటు చేసిన పౌర పఠన కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కలెక్టరేట్‌కు ఆయా పనుల నిమిత్తం వచ్చే వారికి ఈ కేంద్రం ఉపయోగపడుతుందన్నారు. కంప్యూటర్లు, స్మార్ట్‌ఫోన్ల టెక్నాలజీతో మధ్యలో గ్రంథాలయాల వినియోగం కొంత తగ్గిందన్నారు. ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రకటనలతో ఉద్యోగార్థులు గ్రంథాలయాలకు క్యూ కడుతున్నారని పేర్కొన్నారు.

## క్లుప్తంగా

### ఎన్‌ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సుభాష్‌



సుభాష్‌కు నియామక పత్రాన్ని అందిస్తున్న ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి

**పూడూరు:** ఎన్‌ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండల పరిధిలోని మీర్జాపూర్‌కు చెందిన సిద్దులూరి సుభాష్‌ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా అధ్యక్షుడు పట్లోళ్ల సతీశ్‌రెడ్డి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుభాష్‌ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా యువతను చైతన్యం చేసి కాంగ్రెస్‌ పార్టీ గెలుపు కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, ఎన్‌ఎస్‌యూఐ ఉపాధ్యక్షుడు సైఫ్‌ఖాన్‌, పరిగి అసెంబ్లీ యూత్‌ కాంగ్రెస్‌ ఉపాధ్యక్షుడు నవీన్‌, ఎంపీటీసీ లక్ష్మణ్‌, నాయకులు పాల్గొన్నారు.

### ఉద్యమకారులకు ఘన సన్మానం



ఉద్యమంలో పాల్గొన్న ఉపాధ్యాయులను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

**తాండూరు టౌన్‌:** ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడిన పలువురు ఉద్యమకారులను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్‌ మురళీకృష్ణ గౌడ్‌ శుక్రవారం ఘనంగా సన్మానించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున వారిని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో అన్ని వర్గాల ప్రజలు పోరాటంలో భాగస్వాములయ్యారన్నారు. వారిని సత్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నప్పటికీ, నిర్లక్ష్యంగా వ్యవహరించడం సిగ్గు చేటన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమకారులను సన్మానించడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు సుదర్శన్‌ గౌడ్‌, మున్సిపల్‌ ఫ్లోర్‌ లీడర్‌ లలిత, అసెంబ్లీ కన్వీనర్‌ రజినీకాంత్‌, పూజారి పాండు తదితరులు పాల్గొన్నారు.

### కఠినంగా శిక్షించాలి

**అనంతగిరి:** జిల్లాలో దళితులపై జరుగుతున్న దాడులకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి అన్నారు. ఈమేరకు శుక్రవారం వికారాబాద్‌లోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లా నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 5, 6, 7 తేదీల్లో కల్వకుర్తిలో రాష్ట్ర సామాజిక రాజకీయ శిక్షణ తరగతులు జరుగుతున్నాయన్నారు. జిల్లా నుంచి ముఖ్య నాయకులు హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మహిపాల్‌, హరికృష్ణ, సుదర్శన్‌, శ్రీనివాస్‌, రాజు, యాదయ్య, గోపాల్‌, సురేస్‌ తదితరులు పాల్గొన్నారు.

### కార్మికుల శ్రమతోనే ఆదర్శ గ్రామం

గౌతాపూర్‌ సర్పంచ్‌ రాజప్పగౌడ్‌



పంచాయతీ కార్మికులను సన్మానించిన సర్పంచ్‌ రాజప్పగౌడ్‌

**తాండూరు రూరల్‌:** పంచాయతీ కార్మికుల కృషితోనే గౌతాపూర్‌ ఆదర్శ గ్రామంగా నిలిచిందని సర్పంచ్‌ రాజప్పగౌడ్‌ అన్నారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా శుక్రవారం గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. వారిని శాలువాలు, పూలమాలతో సన్మానించారు. పదో తరగతిలో అధిక మార్కులు సాధించిన రేణుకను సన్మానించారు. పంచాయతీ కార్యదర్శి ఫక్రోజీ, కో ఆప్షన్‌ సభ్యులు నారాయణ రెడ్డి, వెంకటయ్య గౌడ్‌, వార్డు సభ్యుడు మహేశ్‌, మహిళా సంఘం అధ్యక్షురాలు మంజుల, హెచ్‌ఎం ఉమారాణి పాల్గొన్నారు.


సాక్షి క్లాసిఫైడ్స్‌

WANTED

■ హరేకృష్ణ హోంకేర్‌ హైదరాబాద్‌ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్‌/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ:18K. ఏజెంట్‌ కమీషన్‌.6K.Ph: 9963114535/ 7287061111 [H-793435]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌/ డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.




బోనమెత్తిన చిన్నారులు



ధారూరులో బొడ్రాయి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు

### వైభవంగా బొడ్రాయి పునఃప్రతిష్ఠ

ధారూరు మండల కేంద్రంలో శుక్రవారం బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన మహోత్సవం కనులపండువగా జరిగింది. స్థానిక హనుమాన్‌ దేవాలయం సమీపంలో నెలకొన్న బొడ్రాయి పూర్తిగా భూమిలోకి కూరుకుపోవడంతో దాని స్థానంలో కొత్తగా బొడ్రాయిని పునఃప్రతిష్ఠించారు. ఊరంతా ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వేళ ప్రతి ఇంటి నుంచి బోనాలతో తరలివచ్చి నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా పోతరాజుల విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. – ధారూరు



పోతరాజుల విన్యాసాలు

### షాట్‌పుట్‌లో సత్తాచాటిన సేవ్యానాయక్‌



**కడ్తాల్‌:** మండల పరిధిలోని గానుగుమార్లతండాకు చెందిన సేవ్యానాయక్‌ రాష్ట్ర స్థాయి షాట్‌పుట్‌ (సీఎం కప్‌–2023)లో సత్తాచాటారు. పురుషుల విభాగంలో తృతీయ స్థానం సాధించారు. కాంస్య పతకంతో పాటు, రూ.10 వేల నగదు బహుమతిని అందుకున్నారు. ఈ మేరకు సేవ్యానాయక్‌ స్థానిక బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి కావడంతో, శుక్రవారం పాఠశాల పీడీ చంద్రమోహన్‌తో పాటు, హెచ్‌ఎం జంగయ్య, సీఎం కప్‌ మండల కన్వీనర్‌ ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్‌, వైస్‌ ఎంపీపీ ఆనంద్‌, సర్పంచ్‌ ఎల్‌ఎన్‌ రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి క్రీడాకారుడిని అభినందించారు.

## రైతులను భాగస్వాములను చేయండి

ఆర్డీఓ అశోక్‌కుమార్‌

**తాండూరు రూరల్‌:** రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రైతు దినోత్సవం ఘనంగా నిర్వహించాలని తాండూరు డివిజన్‌ ఆర్డీఓ అశోక్‌కుమార్‌ అన్నారు. శుక్ర వారం తాండూరు మండలంలోని ఐనెల్లి, కరన్‌కోట్‌, సిరిగిరిపేట్‌, అంతారం, నారాయణపూర్‌, చెంగోల్‌ రైతు వేదికలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రైతు దినోత్సవంలో రైతులను భాగస్వా ములను చేసి..విజయవంతం చేయాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు నిర్లక్ష్యం వహించొద్దని హెచ్చరించారు. రైతులందరితో సామూహిక భోజనం చేయించాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ రుద్రమూర్తి, తహసీల్దార్‌ చిన్నప్పల నాయుడు, ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి, ఏఓ రజిత, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్‌ రాంలింగారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



ఐనెల్లిలోని రైతు వేదిక క్లస్టర్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ అశోక్‌కుమార్‌

## దశాబ్ది ఉత్సవాల్లో ప్రొటోకాల్‌ రగడ

అవమానంతో వేడుకల్లోంచి వెళ్లిపోయిన మున్సిపల్‌ చైర్‌పర్సన్‌

**తాండూరు:** రాష్ట్ర దశాబ్ది వేడుకల్లో ప్రొటోకాల్‌ రగడ నెలకొంది. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాల మైదానంలో దశాబ్ది వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ స్వప్నపరిమళ్‌ హాజరయ్యారు. ఎమ్మెల్యే రోహిత్‌ రెడ్డితో కలిసి జాతీయ జెండాను ఎగుర వేశారు. తర్వాత ప్రభుత్వ జూనియర్‌ కళాశాల నూతన భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సైతం మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసి సమావేశంలో వేదికపైకి వచ్చిన మున్సిపల్‌ చైర్‌పర్సన్‌కు ప్రొటోకాల్‌ ప్రకారం ఎమ్మెల్యే పక్కన కుర్చీపై కూర్చోవాలి. అయితే ఎమ్మెల్యే పక్కన ఆర్డీఓ అశోక్‌ కుమార్‌, మరోపక్క జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ రాజుగౌడ్‌ కూర్చున్నారు. చైర్‌పర్సన్‌ వేదికపైకి వెళ్లి తనకు కూర్చోవడానికి స్థానం ఇవ్వాలని ఆర్డీఓను కోరారు. అయితే వెనుకాల సీటు చూపించారు. దీంతో ఆర్డీఓకు చైర్‌పర్సన్‌ మధ్య మాటా మాట పెరిగింది. దీంతో అవమానభారంతో చైర్‌పర్సన్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు వేడుకల మధ్యలో నుంచి వెళ్లిపోయారు.

**ఆర్డీఓపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తా.. స్వప్నపరిమళ్‌**

ఆర్డీఓ అశోక్‌కుమార్‌ ఉన్నతాధికారిగా వ్యవహరించకుండా రాజకీయాలు చేస్తున్నారని చైర్‌పర్సన్‌ స్వప్నపరిమళ్‌ ఆరోపించారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ రెండున్నరేళ్లుగా మున్సిపాలిటీకి ఆర్డీఓ శనిలా దాపురించారన్నారు. ఆర్డీఓ వ్యవహార శైలి కారణంగానే ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి తనకు విభేదాలు చోటుచేసుకున్నాయని అన్నారు. ప్రభుత్వ జూనియర్‌ కళాశాల మైదానంలో జరిగిన ఉత్సవాల్లో ప్రొటోకాల్‌ ప్రకారం వేదికపైకి పిలిచారన్నారు. వేదికపైకి ఆర్డీఓ పేరు పిలవకముందే వెళ్లి కూర్చున్నారన్నారు. తన స్థానం ఇవ్వాలని కోరితే వెనకాల కూర్చోమంటూ అవమానించారన్నారు. గతంలో మున్సిపాలిటీకి ఇన్‌చార్జి కమిషనర్‌గా రెండేళ్ల పాటు కొనసాగిన ఆర్డీఓ తన హక్కులను హరించారన్నారు. తాను అధికార పార్టీలో ఉన్న కూడా ఎలాంటి అభివృద్ధి పనులు జరగకుండా అడ్డుకున్నారన్నారు. దశాబ్ది వేడుకల్లో సంస్కారం లేకుండా ఆర్డీఓ వ్యవహరించారన్నారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని చైర్‌పర్సన్‌ చెప్పారు.

## దశాబ్దికి వెలగని కార్యాలయాలు

ప్రభుత్వ నిబంధనలు బేఖాతరు

**పెద్దేముల్‌:** తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని.. ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్‌ దీపాలతో అలంకరించాలని.. ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినా.. మండల పరిధిలో మాత్రం అందుకు విరుద్ధంగా ఉత్సవాలు నిర్వహించారు. మహిళా సమాఖ్య భవనం, మండల వనరుల కేంద్రం, రైతు వేదిక, విద్యుత్‌ కార్యాలయం, పశువైద్య కేంద్రంతో పాటు పలు శాఖల అధికారుల కార్యాలయాలకు లైట్లు వేయకుండానే ఉత్సవాలు ప్రారంభించారు. గమనించిన ఎంపీపీ అనురాధ తప్పకుండా లైట్లు ఏర్పాటు చేయాలని ఏపీఓ బాలయ్య, ఉపాధి పీఓ లక్ష్మీదేవితో పాటు పలుశాఖల అధికారులు లైట్లు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీచేశారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.





బోసిపోయిన పెద్దేముల్‌ మహిళా సమాఖ్య భవనం, మండల విద్యావనరుల కేంద్రం

## రైతు కుటుంబాలకు ‘సహకారం’



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న డీసీసీబీ చైర్మన్‌ మనోహర్‌ రెడ్డి

డీసీసీబీ చైర్మన్‌ మనోహర్‌ రెడ్డి

**కుల్కచర్ల:** రైతు కుటుంబాలకు సహకార సంఘాలు ఎల్లవేళలా అండగా ఉంటాయని డీసీసీబీ చైర్మన్‌ మనోహర్‌ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన నర్సయ్య అనే రైతు మృతిచెందాడు. నర్సయ్య కుల్కచర్ల ప్రాథమిక సహకార సంఘంలో సభ్యత్వం ఉన్న నేపథ్యంలో పీఏసీఎస్‌ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి తక్షణ సాయం కింద రూ.9వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక సహకార సంఘంలో సభ్యత్వం ఉన్న రైతులందరికీ సహకార సంఘం అండగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, పీఏసీఎస్‌ సీఈఓ బక్కారెడ్డి, వైస్‌ చైర్మన్‌ నాగరాజు యాదవ్‌, డైరెక్టర్లు కొండయ్య, రత్నమ్మ, నర్సింహులు ఆయా గ్రామాల నేతలు పాల్గొన్నారు.

## ప్రజలు సోదరభావంతో మెలగాలి

జాతీయ ఉత్తమ సామాజిక సేవా అవార్డు గ్రహీత పెంటయ్య

**దోమ:** ప్రజలు కుల, మత బేధాలకు తావులేకుండా సోదర భావంతో కలిసిమెలసి ఉండాలని జాతీయ ఉత్తమ సామాజిక సేవా అవార్డు గ్రహీత పెంటయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పెంటయ్య మాట్లాడుతూ.. గురువారం బ్రాహ్మణపల్లి గ్రామంలో దళితులపై జరిగిన దాడి, ఇరువర్గాల వ్యక్తులు పోలీసుల వాహనంపై రాళ్లు రువ్వడం హేయనీయమైన చర్య అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. గొడవలతో జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య, అంబేడ్కర్‌ సంఘం జిల్లా నాయకులు అంజిరావన్‌, అంబేడ్కర్‌ సంఘం పరిగి తాలూకా అధ్యక్షుడు భాస్కర్‌, ఎమ్మార్పీఎస్‌ నాయకులు రమేశ్‌, కేవీపీఎస్‌ నాయకులు, బీసీ సంఘం నేతలు శివకుమార్‌ గౌడ్‌, సంజీవ్‌కుమార్‌, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పెంటయ్య

## అమరుల ఆశయాలను విస్మరించి ఉత్సవాలా.?

టీజేఎస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి సోమశేఖర్‌

**తాండూరు టౌన్‌:** ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ప్రాణాలను త్యాగం చేసిన అమరుల ఆశయాలను విస్మరించి ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలను నిర్వహించడం సిగ్గుచేటని తెలంగాణ జన సమితి తాండూరు ఇన్‌చార్జి, కౌన్సిలర్‌ సోమశేఖర్‌ అన్నారు. శుక్రవారం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఇందిరాచౌక్‌లో ఆచార్య జయశంకర్‌ విగ్రహానికి పూలమాల వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌ ఉద్యమ ద్రోహులకు మంత్రి పదవులు, కార్పొరేషన్‌ చైర్మన్‌ పదవులు ఇచ్చి అమరులను అవమానపరిచారన్నారు. నిరుద్యోగాన్ని, పేదరికాన్ని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్రంలోని సహజ వనరుల దోపిడీని అడ్డుకట్ట వేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్ష మేరకు నీళ్లు, నిధులు, నియామకాలను చేపట్టాలని డిమాండ్‌ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యావంతుల వేదిక, పలు ప్రజాసంఘాల నాయకులు కౌన్సిలర్‌ శ్రీనివాస్‌, అంజిలయ్య, శ్రీనివాస్‌, గౌరీశంకర్‌, రామకృష్ణ, సందీప్‌, నూరొద్దీన్‌ తదితరులు పాల్గొన్నారు.



జయశంకర్‌ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న టీజేఎస్‌, టీవీవీ, ప్రజాసంఘాల నాయకులు

## యువతకు ఛత్రపతి ఆదర్శం

కేఎస్‌ఆర్‌ ట్రస్ట్‌ వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ

**దోమ:** ఛత్రపతి శివాజీ యువతకు ఆదర్శమని కేఎస్‌ఆర్‌ ట్రస్ట్‌ వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ అన్నారు. శుక్రవారం ఆమె మండల పరిధిలోని మోత్కూర్‌ గ్రామంలో ఛత్రపతి శివాజీ విగ్రహా ప్రతిష్ఠాపనకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..శివాజీ పరిపాలన నేటికి పాలకులకు ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు శివ, హన్మంతు, సతీశ్‌, చందు యాదవ్‌, సారంగి, యాదగిరి, మహేశ్‌, కార్తీక్‌, సురేశ్‌, అరుణ్‌, అరవింద్‌, అర్జున్‌, బాను, రాజు, శ్రీను, సాయి తదితరులు పాల్గొన్నారు. ఇటీవల బీజేపీ కార్యకర్త కుమ్మరి వెంకటయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాజేశ్వరమ్మ బాధిత కుటుంబాన్ని పరామర్శించి గ్రామంలో బీజేపీ కార్యకర్త కుమ్మరి వెంకటయ్య అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాజేశ్వరమ్మ బాధిత కుటుంబాన్ని పరామర్శించి, అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రహ్లాదరావు, సర్పంచ్‌ కేశవులు, గ్రామస్తులు అంజిలయ్య, సీత్యా బాల్‌రాజ్‌, నర్సింహులు, రామలింగం, చెన్నకేశవులు, విశ్వనాథం, తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న రాజేశ్వరమ్మ

## దివ్యాంగులకు ఉచిత విద్య

- వేగేశ్న ఫౌండేషన్‌ సేవలు విస్తరిస్తాం
- ఫౌండేషన్‌ వ్యవస్థాపకుడు డాక్టర్‌ వంశీరామరాజు వెల్లడి



వంశీరామరాజు

**అబ్దుల్లాపూర్‌మెట్‌:** దివ్యాంగులైన చిన్నారులకు ఆంగ్ల మాధ్యమంలో ఒకటవ తరగతి నుంచి పదో తరగతి వరకు ఉచిత విద్య అందిస్తామని వేగేశ్న ఫౌండేషన్‌ వ్యవస్థాపకుడు డాక్టర్‌ వంశీ రామరాజు, చైర్‌పర్సన్‌ సుంకరపల్లి శైలజ తెలిపారు. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని వారు మాట్లాడుతూ 35 ఏళ్లుగా అబ్దుల్లాపూర్‌మెట్‌ మండలం కుంట్లూర్‌లో తమ ఫౌండేషన్‌ ద్వారా దివ్యాంగులకు ఎనలేని సేవలందిస్తున్నామన్నారు. వేగేశ్న ఫౌండేషన్‌ సేవలను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరిస్తున్నట్లు వారు తెలిపారు. శారీరక దివ్యాంగులైన వారికి ఫిజియో థెరపీ, సర్జికల్‌ కరెక్షన్స్‌, కృత్రిమ అవయవాలను ఫౌండేషన్‌ ద్వారా సమకూర్చనున్నట్లు చెప్పారు. దివ్యాంగులైన వారి పిల్లలకు కూడా తమ ఫౌండేషన్‌ ద్వారా ఉచిత సేవలు అందించనున్నామన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో చదువుకుంటున్న దివ్యాంగులైన చిన్నారులకు కావాల్సిన సహకారాన్ని అందిస్తామన్నారు. తమ ఫౌండేషన్‌ద్వారా ఉచిత సేవలను పొందాలనుకునే వారు కుంట్లూర్‌లోని వేగేశ్న ఫౌండేషన్‌లో ఈ నెల 13వ తేదీ నుంచి సంప్రదించాలని కోరారు.



ఆలయం చుట్టూ భక్తుల ప్రదక్షిణలు

### ఎల్లమ్మతల్లికి బోనాలు

కుల్కచర్ల మండలం కామునిపల్లిలో శుక్రవారం ఎల్లమ్మ తల్లి బోనాలు కనులపండువగా జరిగాయి. భక్తులు, గ్రామస్తులు భారీగా తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బోనాలతో తరలివచ్చి అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం నైవేద్యాలు సమర్పించి మొక్కులు సమర్పించారు. తమను చల్లంగా చూడాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు. – కుల్కచర్ల



బోనాలతో తరలివస్తున్న మహిళలు, భక్తులు